www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 5 జూన్ 2025



వైఎస్ఆర్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-వల్లూరు

గ్రామీణ ప్రాంతాలలో మహిళలు ఆర్థికంగా ఎదగాలని యాదాల శేషగిరి మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ వంకదారి ఆంజనేయులు అన్నారు. బుధవారం వల్లూరు మండలం గణేష్‌పురంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌ను అందజేస్తామని పేర్కొన్నారు. ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కొరకు 9949015529 నెంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు. మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిసిహెచ్‌ఎస్‌లో ప్రమోషన్లేవీ!

- 15 ఏళ్లుగా సబార్డినేట్ల నిరీక్షణ
- ఆందోళనలో క్లాస్-4 ఉద్యోగులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రుల సబార్డినేట్ ఉద్యోగులు దశాబ్దాలుగా ప్రమోషన్లకు నోచుకోవడం లేదు. 2010 నుంచి 2025 వరకు 15 ఏళ్లుగా సబార్డినేట్ తదితర ఉద్యోగులకు ప్రమోషన్లు అందని ద్రాక్షను తలపిస్తున్నాయి. ప్రభుత్వం ఏటా ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు పెద్దఎత్తున నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. తమకు ఎందుకు ప్రమోషన్లు కల్పించడం లేదని సబార్డినేట్, తదితర ఉద్యోగులు వాపోతున్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని 16 కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రులు ఉన్నాయి. కడప, చెన్నూరు, కమలాపురం, బద్వేల్, ప్రొద్దుటూరు, రైల్వేకోడూరు, వేంపల్లి కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రుల్లో సబార్డినేట్ స్థాయి ఉద్యోగులు మొదలుకుని వాటర్ కమ్ వాచ్‌మెన్, ఎఫ్ఎన్ఒ, ఎంఎన్ఒ, జిడిఎ కేటగిరీల పరిధిలో తొమ్మిది మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఆరుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. వీరందరూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు చెందిన వారు కావడంతోనే దశాబ్దాలుగా ప్రమోషన్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో తమకు ప్రమోషన్లు లభించి ఉంటే పలు ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు లభించేవని చెబుతున్నారు. సబార్డినేట్ తదితర ఉద్యోగులు పలుమార్లు కమిషనర్ మొదలుకుని, కలెక్టర్, డిసిహెచ్ఎస్ కో-ఆర్డినేటర్ల వరకు వినతిపత్రాలు అందజేశామని, కమిషనర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనమూ లభించకపోవడం దురదృష్టకరమని వాపోతున్నారు. గతంలోని డిసిహెచ్ఎస్ కో-ఆర్డినేటర్లు తమ ప్రమోషన్లను పట్టించుకున్న పాపానపోలేదని వాపోతున్నారు. ప్రభుత్వం తమకు ప్రమోషన్లు కల్పిస్తే జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ తదితర ప్రమోషన్లు లభించే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. డిసిహెచ్ఎస్ కో-ఆర్డినేటర్లు ఉద్యోగుల అర్హతల ఆధారంగా ప్రమోషన్లు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది. ఉద్యోగుల దగ్గర స్కిల్స్ లేకపోవడం వల్లే ఇవ్వలేకపోతున్నామనే వాదన వినిపిస్తోంది. సబార్డినేటర్లు ప్రమోషన్ ఇచ్చిన తర్వాత స్కిల్స్ పరీక్షించాలని, ఇవ్వకుండానే స్కిల్స్ లేవనే పేరుతో అన్యాయం చేయడం సబబు కాదని వాపోతుండడం గమనార్హం. ప్రస్తుత బదిలీల నేపథ్యంలోనైనా తమ విజ్ఞప్తులను కలెక్టర్, డిసిహెచ్ఎస్ కో-ఆర్డినేటర్ తమ విజ్ఞప్తులను పరిశీలించాలని కోరుతున్నారు.

డిసిహెచ్ఎస్ ఉద్యోగులకు అన్యాయం చేయడం తగదు

డిసిహెచ్ఎస్ ఆస్పత్రుల్లో అర్హులైన ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలి. లేనిపోని కారణాలతో చిరు ఉద్యోగులకు అన్యాయం చేయడం తగదు. లేనిపక్షంలో ఉద్యోగుల తరపున ఉద్యమం చేపడతాం.

- పి.వెంకటసుబ్బయ్య, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి, కడప.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి-కడప అర్బన్

జిజిహెచ్‌లో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిజిహెచ్‌లో హరికృష్ణ, సంధ్య సెక్యూరిటీ గార్డ్‌గా, మహేష్ శానిటేషన్ సూపర్వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. మూడు నెలల కిందట ఎ1 కాంట్రాక్టు పరిధిలో సబ్ కాంట్రాక్టర్ అకారణంగా విధుల నుంచి తొలగించారని తెలిపారు. డిసెంబర్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రిమ్స్‌కు వచ్చినప్పుడు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారని చెప్పారు. ఆ కారణం చేత వారిని విధుల నుంచి సబ్ కాంట్రాక్టర్ తొలగించడం అన్యాయమని తెలిపారు. కడప నగరంలో ఉన్న మెడికల్ కాలేజీ, జనరల్ డెంటల్ హాస్పిటల్, నర్సింగ్ కాలేజ్, సూపర్ స్పెషాలిటీ, కేన్సర్, సైక్రియార్టీలలో పనిచేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ కార్మికులకు సబ్ కాంట్రాక్టర్‌గా బాల నారాయణరెడ్డి ఇప్పటి వరకు ఉన్నారని, ఆయన కూడా కార్మికులకు జిఒ ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా కట్టడం లేదని పేర్కొన్నారు. శానిటేషన్ కార్మికులకు జిఒ ఎంఎస్ నంబర్ 549 ప్రకారం రూ.16 వేలు ఇవ్వాల్సి ఉంటే, ఇక్కడ ఉన్న సబ్ కాంట్రాక్టర్ రూ.12,403 కొంతమంది కార్మికులకు ఇస్తున్నారని పేర్కొన్నారు. మరి కొంతమంది కార్మికులకు రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులకు రావాల్సిన పిఎఫ్, ఇఎస్ఐ కాంట్రాక్టర్ కట్టాల్సిన శాతం కట్టకుండా కార్మికుల జీవితంలోనే కార్మికుల శాతం కాంట్రాక్ట్ శాతం కడుతున్నాడనీ విమర్శించారు. అది కూడా అరకొర మాత్రమే వీరికి కడుతున్నాడని తెలిపారు. సక్రమంగా సిఎల్, మహిళలకు ఇవ్వాల్సిన ప్రత్యేకమైన ఐదు రోజులు సెలవులు, యూనిఫామ్స్ ఎవరికి ఇవ్వలేదని తెలిపారు. పేరుకు మాత్రం బులుగురకం ఆప్రాన్ మాత్రమే ఇచ్చారన్నారు. సెక్యూరిటీ గార్డ్స్‌కు కూడా పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా కట్టడం లేదు, వారికి ఇవ్వాల్సిన డే ఆఫ్‌లు గాని, సిఎల్ఎస్, మహిళలకు ఇవ్వాల్సిన ప్రత్యేక సెలవులు గాని, యూనిఫామ్స్ గాని సక్రమంగా ఇవ్వలేదని విమర్శించారు. ఒక సంవత్సరానికి రెండు జతలు యూనిఫామ్ ఇవ్వాలని అగ్రిమెంట్లో పొందుపరిచి ఉన్నారని చెప్పారు. అవి అమలు చేయడం లేదని తెలిపారు. సంవత్సరానికి ఒక్క జత ఈయడమే పెద్ద గగనం ఎవరైనా అడిగితే వారిని తిట్టడం, వేధించడం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చే టెండర్లలో సబ్ కాంట్రాక్ట్ ఇవ్వకుండా మెయిన్ కాంట్రాక్టర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మెయిన్ కాంట్రాక్టర్ వస్తే కార్మికులకు వచ్చే సెలవులు, వేతనం, యూనిఫామ్స్ సక్రమంగా ఉంటాయన్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని సబ్ కాంట్రాక్ట్ ఎవరికి ఇవ్వకుండా చూడాలని కోరారు. తొలగించిన వారిని వెంటనే విధులకు తీసుకోవాలని కోరారు. వారిని తీసుకోకపోతే ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు నగర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పి.చంద్రారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, నగర కమిటీ సభ్యులు కె.మహేష్, మెడికల్ యూనియన్ నాయకులు పి.పవన్, ఉదయ్ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం


-'వెన్నుపోటు దినం' నిరసనలో వైసిపి నాయకులు



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కడప

కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని విస్మరించిందని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. వైసిపి ఆధ్వర్యంలో బుధవారం కడప నగరంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. వైసిపి జిల్లా కార్యాలయం నుండి ప్రారంభమైన నిరసన రాయల్ కోటిరెడ్డి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామను వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు మళ్లీ రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచి, నమ్మబలికి మోసం చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్, 143 హామీలను నెరవేర్చకుండా దుష్ట, దుర్మార్గ పాలనను సాగిస్తున్నాడని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయనిని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు .చంద్రబాబు చేసిన మోసం అర్థమయ్యి జగన్‌ను ఎందుకు ఓడించామని బాధపడుతున్నారని తెలిపారు. కడప ఆర్‌డిఒ కార్యాలయం ఎఒకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, నాయకులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మండల అధ్యక్షులు, జిల్లా, నగర అనుబంధ విభాగాల అధ్యక్షులు, వారి కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు, రైతులు, విద్యార్థులు, మహిళ నాయకురాలు, కార్యకర్తలు, కడప నియోజకవర్గం ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని విస్మరించిందని కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా పాత ఎమ్మెల్యే కార్యాలయం నుండి పాత బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి, అక్కడనుండి ఆర్‌డిఒ కార్యాలయం చేరుకుని ఆర్‌డిఒ చిన్నయ్యకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి.సతీష్ కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **చాపాడు(మైదుకూరు) :** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను టిడిపి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి డిమాండ్ చేశారు. మైదుకూరులోని వనిపెంట రోడ్డులోని అంకాలమ్మ గుడి నుండి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పి చైర్మన్ రామగోవిందరెడ్డి, రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు ఆర్.వి.సుబ్బారెడ్డి, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. **ఖాజీపేట :** కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వమని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పివి రాఘవరెడ్డి విమర్శించారు. మైదుకూరులో వైసిపి ఆధ్వర్యంలో తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. **ఎర్రగుంట్ల :** సూపర్‌సిక్స్ పథకాలని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారని కూటమి ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విమర్శించారు. వైసిపి పార్టీ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి సుధీర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శేషఫణికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాలయ్య, జయరామకృష్ణారెడ్డి, గంగా కృష్ణారెడ్డి, దాసరి సూర్యనారాయణ రెడ్డి, సాంబశివరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మాడిశెట్టి శివ, ముద్దనూరు, కొండాపురం వైసిపి నాయకులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు:** కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్నో మాయమాటలు, మోసపు మాటలు చెప్పి వెన్నుపోటు పొడిచారని వైసిపి అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్ రెడ్డి అన్నారు. పుట్టపర్తి సర్కిల్లో వేలాది మందితో నిరసన కార్యక్రమం నిర్వహించారు. **కమలాపురం టౌన్ :** నియోజకవర్గ బాధ్యుడు నరేన్ రామానుజన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ చావిడి నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు వైసిపి నాయకులు కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. **జమ్మలమడుగు రూరల్ :** సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రా రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా వైసిపి కార్యాలయం నుండి నాయకులు కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి ఆర్‌డిఒ సాయి శ్రీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజల కోసం గత ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. నవరత్నాలు చూసి నాడు కూటమి పార్టీలు అధికారం కోసం సూపర్ సిక్స్ పథకాలు చెప్పారన్నారు. 143 హామీలు ప్రజలకు ఇచ్చి ఇప్పుడు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. గ్రామ, వార్డు వాలంటీర్లకు పదివేల రూపాయల గౌరవ వేతనం ఇస్తామని నమ్మబలికి వాలంటీర్లను నిలువునా ముంచారన్నారు. వాలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యం చూసి మళ్లీ రాష్ట్ర ప్రజలు జగన్‌నే ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఆర్థికంగా జగన్ సిఎంగా ఉన్నప్పుడు అనేక పథకాల ద్వారా లాభపడేవారని ఇప్పుడు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు. ఎక్కడ చూసినా అస్తవ్యస్త పరిపాలనా కొనసాగుతుందని ప్రతి పథకాన్ని నేరుగార్చే విధంగా కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా మున్సిపల్ విభాగ అధ్యక్షుడు వల్లంభాయి హృషి కేశవరెడ్డి, చిన్న కొమెర్ల జగదీశ్వరరెడ్డి, గజ్జల లక్ష్మయ్య, వినయ్, ముల్లా జానీ, గూడెం చెరువు నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



పులివెందుల : ఆర్‌డిఒకు వినతి పత్రం ఇస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-కమలాపురం టౌన్



బాధితులతో పుత్తా నరసింహారెడ్డి

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలో అర్హులైన 11 మందికి రూ.7,29,288 సిఎం సహాయక నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు సిఎం సహాయనిధి ఆసరాగా ఉంటుందన్నారు. అర్హులైన పేదలందరూ కూడా ఎవరైనా అధిక ఖర్చులతో వైద్యం చేయించుకున్న వాటి తాలూకు ఒరిజినల్ బిల్లులు తీసుకొస్తే సిఎం సహాయక నిధి నుండి ఫండ్స్ రిలీజ్ చేయిస్తామని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు చర్యలు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు బలమైన అడుగులు వేస్తున్నట్లు ఆర్‌వైఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం డిపిఎం కార్యాలయంలో జిల్లా స్థాయి ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభించారు. వ్యవసాయ సంచాలకులు, ఉద్యాన శాఖ అధికారులకు ప్రకృతి వ్యవసాయంపై లోతైన అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ శిక్షణలో పాల్గొన్న సభ్యులు తమ మండలాల్లో రైతు సేవ కేంద్రం ఇన్‌ఛార్జులకు తదుపరి శిక్షణల కార్యక్రమాలు అందించనున్నారు. ఆర్‌వైఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యత, భూమి ఆరోగ్యాన్ని పునరుద్ధరించడంలో దీని పాత్రను వివరించారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి సుభాషిణి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, అదనపు డిపిఎం వసంత కుమారి, థీమాటిక్ లీడ్ సురేష్ బాబు, జిల్లా వ్యవసాయ సంచాలకులు, హార్టికల్చర్ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

6 నుంచి ఐటిఐలో ప్రవేశానికి కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఐటిఐలలో అడ్మిషన్ల ప్రవేశానికి కౌన్సెలింగ్ ఈ నెల 6 నుంచి ప్రారంభమవుతుందని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ జ్ఞాన కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు. రిమ్స్ సమీపంలో ఉన్న పుష్పగిరి కంటి ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రభుత్వ మైనార్టీ ఐటిఐలో అభ్యర్థులు హాజరు కావాలని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు.

ఖరీఫ్ పంటలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-వల్లూరు : ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించినట్లు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మంగేష్ దుదే అన్నారు. మండల పరిధిలోని తోలగంగనపల్లి, గోటూరులో బుధవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ద్వారా ఖరీఫ్ పంటపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలతో రైతుల ప్రత్యక్ష సంభాషణలను, వారికి ఖరీఫ్ పంట కాలం ముందు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడానికి 700 జిల్లాలలో రెండువేల కంటే ఎక్కువ శాస్త్రీయ బృందాల భాగస్వామ్యంతో నూతన సాంకేతిక, ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం కొరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. నువ్వులలో మేలైన రకాలు యాజ మాన్య పద్ధతుల గురించి, సూక్ష్మ నీటి ద్వారా సాగులో సాంకేతికత, డ్రోన్ల సాంకేతికత గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ సాయి మహేశ్వరి డాక్టర్ సురేష్ కుమార్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంగేష్ దుదే

అనంతపురం, నెల్లూరు జట్ల ఘన విజయం



తలపడుతున్న చిత్తూరు, అనంతపురం జట్లు



వీరారెడ్డి (125 నాటౌట్)

ప్రజాశక్తి - కడప

సౌత్‌జోన్ ఎసిఎ అండర్-23 వన్డే క్రికెట్ టోర్నీలో బుధవారం జరిగిన మ్యాచుల్లో అనంతపురం, నెల్లూరు జట్లు ఘన విజయం సాధించాయి. ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై ఏడు వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు 45.1 ఓవర్లలో 217 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రెడ్డిరుషిల్ 60, లోహిత్ లక్ష్మీనారాయణ 80 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దీపక్ 3, ప్రదీప్ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 218 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 25.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని కే హెచ్. వీరారెడ్డి అదుతేంగా బ్యాటింగ్ ప్రదర్శించి 125 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 69 బంతులను ఎదుర్కొని 14 బౌండరీలు, 7బౌండరీ సిక్సులు సహాయంతో 125 పరుగులు చేశాడు. అర్జున్ టెండూల్కర్ 27 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని మహమ్మద్, రెడ్డి ప్రకాష్, డేనియల్ ఒక్కో వికెట్ తీసుకున్నారు.

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరొక మ్యాచ్‌లో కడప జట్టుపై 13 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు 31.0 ఓవర్లలో 145 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 28, అఖిల్ సాలుంకే 26 పరుగులు చేశారు. కడప జట్టులోని షేక్ ఆదిల్ హుస్సేన్ 4, చెన్నారెడ్డి 3, విజయ భావేంద్రారెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 146 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 37.4 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి సవిచూచింది. ఆ జట్టులోని నాగ చాతుర్య 32, షేక్ ఆదిల్ హుస్సేన్ 40 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సాత్విక్ 3, సయ్యద్ అతిక్ సల్మాన్ 3, మాధవ్ 2 వికెట్లు తీసుకున్నారు.

బక్రీదు రోజున యోగాడే ర్యాలీలు తగదు : పిసిసి

ప్రజాశక్తి - కడప

దేశవ్యాప్తంగా ఈ నెల ఏడవ తేదీన మహమ్మదీయులు అత్యంత పవిత్రంగా నిర్వహించే బక్రీద్ పండుగ రోజు ప్రభుత్వం యోగా డే అవగాహన ర్యాలీలను నిర్వహించడం తగదని పిసిసి ప్రధాన కార్యదర్శి అలీఖాన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే యోగా డే ర్యాలీల నిర్వహణ తేదీని మార్పు చేయాలని కోరారు. ప్రభుత్వం అధికారికంగా బక్రీద్ పండుగ నాడు సెలవుదినంగా ప్రకటించడం వల్ల ఈ ర్యాలీల నిర్వహణ కూడా అధికారులకు సాధ్యం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ కూడా మైనార్టీలకు వ్యతిరేకంగా పాలన చేస్తున్న విధంగా కనపడుతోందని ఆరోపించారు.

సర్వేను సద్వినియోగం చేసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

నిరుపేద పిల్లల కోసం సతి ప్రచార పత్రం అమలు-ఆధార్ కోసం సర్వే, ట్రాకింగ్, సమగ్ర చేరికకు ప్రాప్యత అనే అంశంపై నిర్వహించే సర్వేను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం నగరంలోని దండోరా కాలనీలో సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద పిల్లల కోసం సతి ప్రచార పత్రం అమలు-ఆధార్ కోసం సర్వే ట్రాకింగ్, సమగ్ర చేరికకు ప్రాప్యత, ఆధార్ నమోదు, న్యాయసహాయం, సంక్షేమ పథకాలు మొదలు అంశాలపై సర్వే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సర్వేలో జిల్లా వ్యాప్తంగా పానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, సంబంధిత అధికారులు పాల్గొంటున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది ఆయవారప్ప, పారా లీగల్ వాలంటరీ ఈశ్వరయ్య, ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు, పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

ప్రజాశక్తి - కడప

వైసిపి వెన్నుపోటు దినం జరపడం ప్రజలు చూసి అసహ్యించు కుంటున్నారని జగన్ చేయాల్సింది వెన్నుపోటు దినం కాదని గొడ్డలి పోటు, తల్లి, చెల్లికి రోడ్డుపాలు చేసిన దినం జరపాలని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జిలానిబాషా అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు టిడిపి ప్రభుత్వం చేస్తుంటే ఓర్చుకోలేని జగన్ వెన్నుపోటు దినమని జరపడం సిగ్గుచేటన్నారు. జగన్ ఐదేళ్ల రాక్షస పాలనను రాష్ట్ర ప్రజలు కనివిని ఎరుగని రీతిలో కూటమికి మెజార్టీ స్థానాలు ఇచ్చి కేవలం 11 స్థానాలకే జగన్‌కు ఇచ్చారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు సాగుతున్న ప్రభుత్వాన్ని పొగడాల్సింది పోయి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వైసిపి దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. సమావేశంలో టిడిపి మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు ఖాజాపీర్ ,టిడిపి నాయకులు సాధక్, అక్రమ్, అస్లాం, ఉస్మాన్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - కడప

రక్తదానం ప్రాణదానంతో సమానమని, ముఖ్యంగా యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎంఎం హాస్పిటల్ డాక్టర్ ఎస్.మహబూబ్ పీరా, యునైటెడ్ ముస్లిం ఫోరం కార్యదర్శి రఫీ ఖాన్ అన్నారు. బుధవారం రక్తదానం చేద్దాం కడప జిల్లాను రక్తదాతల జిల్లాగా మారుద్దామని ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు రక్తదానం చేయచ్చని, ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు కరిముల్లా, సిబ్బంది ఆరిఫ్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కడప అర్బన్



బాధితురాలికి చెక్ అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

నడవలేని స్థితిలో ఉన్న బాధితురాలి కాలు సర్జరీ వైద్య ఖర్చుల నిమిత్తం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రూ.2.10 లక్షల ఆర్థిక సాయం అందించారు. బుధవారం కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ రూమ్ హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలసి వారి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. మైదుకూరుకు చెందిన వెలుతుర్ల నాగేంద్ర తన భార్య వెలుతుర్ల లక్ష్మి ఉమాదేవికి కుడికాలు విరిగి రెండుసార్లు సర్జరీలు జరిగినా ఇన్ఫెక్షన్ వలన మళ్లీ సర్జరీ చేయాలని డాక్టర్లు సూచించారనే విషయాన్ని ఈ ఏడాది జనవరి 18వ తేదీన మైదుకూరు స్వచ్ఛ ఆంధ్ర పర్యటనలో భాగంగా ఆమె ఇంటికి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. వైద్య ఖర్చుల కోసం అవసరమైన సాయం చేయాలని కోరారు. ఆ కుటుంబానికి సాయం చేయాలని కలెక్టర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆ మేరకు బాధితురాలు కుటుంబ సభ్యులను కలెక్టరేట్‌కు పిలిపించి వైద్య ఖర్చుల కోసం రూ.2,10 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమలో డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, ఆరోగ్యశ్రీ డిస్టిక్ కో-ఆర్డినేటర్ బాలాంజనేయులు, బాధితురాలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మోడల్ కిచెన్‌లను తీర్చిదిద్దుతాం : కలెక్టర్

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం అత్యంత ప్రధాన్యతతో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆటోమేషన్ సెంట్రల్ కిచెన్స్ (మోడల్ కిచెన్)ల ద్వారా రాష్ట్రానికే ఆదర్శవంతంగా నిర్వహించనున్నామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు అవుతున్న ఆటోమేషన్ సెంట్రల్ కిచెన్స్ నిర్మాణ పనుల పరిశీలనలో భాగంగా బుధవారం కడప నగర పాలక బాలుర ఉన్నత పాఠశాలలో మోడల్ కిచెన్ నిర్మాణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు మధ్యాహ్న భోజనం ఎలా నిర్వహిస్తున్నారనే విషయాలను అడుగుతూ అక్కడి వంటగది సౌకర్యాలను పరిశీలించారు. సరుకులు, వంట చెరుకు, వంట గ్యాస్ తదితర వంట నిర్వహణకు అయ్యే ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రానికే ఆదర్శనీయంగా ఏర్పాటవుతున్న సెంట్రలైజ్డ్ మోడల్ కిచెన్ సెంటర్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మోడల్ కిచెన్, నిర్వహణ పనులను అత్యంత ప్రాధాన్యతతో నూతన విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభం నాటికి త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఇఒ షంషుద్దీన్, ఆగ్రోస్ డిఎం జోయల్ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ రాజా రత్నం, ఎస్ఎస్ఎ, సంబందిత శాఖల ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలలో వంటగది నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్



ఎంఇఒ-2కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలు ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ఎంఇఒ నరసింహశర్మకు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్, జిల్లా ఉపాధ్యక్షులు అజయ్, రాజశేఖర్ మాట్లాడుతూ మైదుకూరు పట్టణంలోని అనేక ప్రయివేట్ పాఠశాలలు విద్యాహక్కు చట్టాలకు వ్యతిరేకంగా తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 12న పాఠశాలను ప్రారంభించాలని నిర్ణయిస్తే 10 రోజులు ముందు నుంచి తరగతులను నిర్వహిస్తున్నారని తెలిపారు. పుస్తకాలు, యూనిఫామ్ అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. విద్యారంగ విధానాలను వ్యతిరేకించిన పాఠశాలలపై అధికారులు కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా నడుచుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అభినయ్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న విద్యుత్ అధికారులు

వినియోగదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ శాఖ లక్ష్యమని ట్రాన్స్‌కో ఎడి శ్రీకాంత్, మండల ఇంజినీర్ నాగరాజ్ పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో విద్యుత్ అధికారులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు విద్యుత్ వినియోగదారులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్తంభాలు ఒరిగి ఉండడం, తీగల కిందకి వేలాడడం వంటి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఎ ఆది, స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, రాష్ట్ర మైనారిటీ నాయకులు కమలాపురం ఫరూక్ అహ్మద్, పూసల కొట్టాల సుబ్బయ్య, ఆసిఫ్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని సుంకేసుల గ్రామ దళితవాడలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి అభిషేకాలు ఆకుపూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్తలు అంజనమ్మ నరసింహులు గ్రామస్తుల సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులను అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాత్రి భజన, కోలాటం ప్రదర్శించారు. స్వామివారిని దర్శించుకోవడానికి పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

సిఐ సత్యనారాయణను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

డిఎస్‌సి అభ్యర్థులపై నిరంకుశ వైఖరి ప్రదర్శించిన సిఐ సత్యనారాయణను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని భారత చైతన్య యువజన పార్టీ పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి నిర్మలా యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుద్యోగులపై పోలీసులు ప్రదర్శించిన నిరంకుశ వైఖరి సరికాదన్నారు. తమ పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్‌పై చేసిన పోలీసుల అరాచక వైఖరిని ఆమె ఖండించారు. హై సెక్యూరిటీ కలిగిన బిసి సామాజిక వర్గానికి చెందిన నేతపై సిఐ హద్దులు దాటి వీధి రౌడీలా ప్రవర్తించడం మంచిది కాదని మండిపడ్డారు. నిరుద్యోగులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

చియ్యపాడులో రేపటి నుంచి గంగ జాతర

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని చియ్యపాడులో శుక్రవారం నుంచి సోమవారం వరకు గంగ జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. శుక్రవారం నుంచి ప్రత్యేకపూజ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 7న గంగా కాటమరాజు కథ, 8న మద్దిమాను యాగం, 9న బండారు ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎంఇఒ నాగేశ్వర నాయక్ వంట ఏజెన్సీలకు సూచించారు. మండలంలోని అన్ని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వంట ఏజెన్సీలకు బుధవారం ఆయన ఒకరోజు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం నుంచి ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని పెట్టాలన్నారు. వంటశాల ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చేతులు, ఆకుకూరలు, కూరగాయలు శుభ్రం చేసుకోవాలన్నారు. యూనిఫామ్ ధరించాలన్నారు. అనంతరం వంట ఏజెన్సీ వారికి రోజు వారి మెనూ ప్రకారం వంటల పోటీలు నిర్వహించారు. బాగా రుచిగా వండిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రాజులగురువాయపల్లె ఉన్నత పాఠశాల వంట ఏజెన్సీ విజయకుమారి, రెండవ బహుమతి ఉప్పలూరు వంట ఏజెన్సీ రమీజా, మూడవ బహుమతి ముద్దనూరు మండల పరిషత్ ప్రాథమిక స్టేషన్ పాఠశాల ఏజెన్సీ షకీనా గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమేశ్వర్‌రెడ్డి, శారదాదేవి, రవిశంకర్, రాజబాబు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

శాంతియుతంగా బక్రీద్ జరుపుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

బక్రీద్ పండుగను శాంతి యుతంగా జరుపుకోవాలని సిఐ ఆర్. మోహన్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన మత పెద్దలతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మతాల పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. బక్రీద్ పండుగను శాంతియుతంగా స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో మత పెద్దలు పాల్గొన్నారు.



శాంతికమిటీతో మాట్లాడుతున్న సిఐ మోహన్

నిఘా నీడలో సింహాద్రిపురం

ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు - చోరీలు, అక్రమ రవాణా అరికట్టడమే లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురం ఇకనుంచి నిఘా నీడలో ఉంటుంది. ఇటీవల కాలంలో ప్రధాన కూడలైన బస్టాండు, ప్రతి ఆదివారం జరిగే సంత మార్కెట్‌తోపాటు ఇతర రద్దీ ప్రాంతాలే లక్ష్యంగా సెల్ ఫోన్ తోపాటు పర్సులు దొంగతనం జరుగుతుండేవి. దీనిపై పలు మార్లు బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. చోరీల నివారణ కోసం పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని సిసి కెమెరాలు ఏర్పాటు చేయించారు.



బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సిసి కెమెరా

ప్రధాన కూడళ్లలో 8 సిసి కెమెరాలు ఏర్పాటు

సింహాద్రిపురం బస్టాండు, సంత మార్కెట్ సమీపంలోని పోలీస్‌స్టేషన్ వద్ద, పులివెందుల రోడ్డులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సిపిఆర్ కెమెరాలను ఏర్పాటు చేశారు. మరికొన్ని ప్రాంతాలలో సైతం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ కెమెరాల పర్యవేక్షణ స్థానిక పోలీస్‌స్టేషన్లో పోలీసులు పరిశీలించేలా ఏర్పాటు చేశారు. పులివెందుల నియోజవర్గంలోని ఏడు మండలాల పరిధిలో మొదటిసారి సింహాద్రిపురంలో సిసి కెమెరాల ఏర్పాటు చేశారు.

చోరీలు, అక్రమ రవాణా అరికట్టడమే లక్ష్యం : ఎస్ఐ రవికుమార్

మండల పరిధిలో చోరీలు, అక్రమ రవాణా అరికట్టడమే లక్ష్యమని ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు. ఆ మేరకు ఆయన స్థానిక బస్టాండ్ ఆవరణలో వ్యాపారస్తులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి వ్యాపార సముదాయం వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు 8 సిసి కెమెరాలు అమర్చామన్నారు. వీటితోపాటు మరికొన్ని త్వరలోనే అమర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు.



వ్యాపారస్తులకు సూచనలిస్తున్న ఎస్ఐ రవికుమార్

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆదరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డిడిఎం విజయవిహారి

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడులో రైతు ఉత్పత్తిదారుల కంపెనీ కొత్త ఆఫీసు ప్రారంభ కార్యక్రమం, పాలకవర్గ సభ్యుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం రాష్ట్ర సమన్వయకర్త ఆదినారాయణ, నాబార్డు డిడిఎం విజయవిహారి మాట్లాడుతూ రైతు సంఘం అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయం పట్ల రైతుల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రకృతి వ్యవసాయం చాపాడు మండలంలోని ప్రతి రైతూ తమ కుటుంబం అవసరాలకి విష రసాయనాలు లేని ఆహారం తినాలని కోరారు. బ్యాంకు అధికారులు మహిళా సంఘాలకి రుణాలు ఇచ్చినట్లే రైతు సంఘాలకి కూడా ఇస్తామని తెలిపారు. ఉత్పత్తి రుణాలు కూడా జన సమృద్ధి పోర్టల్ ద్వారా నమోదు చేసుకుంటే ఇస్తామని తెలిపారు. చాపాడు మండలంలోని రైతులకి నిరంతరం కార్యాలయం అందుబాటులో ఉంటుందన్నారు. వారికి కావాల్సిన ఎరువులు, మందులు, విత్తనాలు, పనిముట్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని ఓబులేసు తెలిపారు. రైతు సమస్యల పరిష్కారం కోసం కిసాన్ మిత్ర హెల్ప్ లైన్ 85009 83300కు కాల్ చేయాలని జయన్న తెలిపారు. సియస్‌ఎ సంస్థ ఆదినారాయణ, చైర్మెన్ సుబ్బారాయుడు, పాలక వర్గ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, బ్యాంకు అధికారులు మల్లికార్జున నాయుడు, కే.వి.ఆర్ రమణ, సమీర్, సుబ్బారామయ్య, బసవయ్య, సియస్‌ఎ సిబ్బంది రమణ, రవితేజ, ఓబులేసు, జయన్న, నాగవేణి, స్రవంతి, పవన్, సునీత పాల్గొన్నారు.

'యశోద'లో శ్వాసకోశ వ్యాధులకు ఆధునిక చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ విశ్వేశ్వరణ్ బాలసుబ్రమణియన్

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన యశోద ఆస్పత్రిలో శ్వాసకోశ వ్యాధులకు ఆధునిక చికిత్స కలదని సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ ఎక్మో అండ్ లంగ్ ట్రాన్స్ ప్లాంటేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ విశ్వేశ్వరణ్ బాలసుబ్రమణియన్ తెలిపారు. బుధవారం నగరంలోని యశోద ఆస్పత్రి మెడికల్ సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ యశోద ఆస్పత్రిలో శ్వాసకోశ వ్యాధులకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కడప నగరానికి చెందిన 60 ఏళ్ల బాషా శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడేవారని తెలిపారు. ఆయనకు ఏ ఆస్పత్రిలో చూపించినా వ్యాధి నయం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాదులోని సోమాజిగూడ యశోద ఆస్పత్రికి వచ్చారని తెలిపారు. ఆయనకు సిటీస్కాన్, పల్మనరీ ఫంక్షన్, బ్రాంకోస్కోపీ పరీక్షలను నిర్వహించి ఇంటర్వెన్షనల్ లంగ్ డిసీజ్ తీవ్రత ఏ స్థాయిలో ఉందో నిర్ధారించారని పేర్కొన్నారు. వ్యాధి నిర్ధారణ తర్వాత అందుకు తగిన చికిత్సను అందించడంతో రోగి క్రమేణా కోలుకున్నారని చెప్పారు. పొగతాగడంతో ఎలాగైతే దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి సమస్య వస్తుందో ఆ విధంగానే ఊపిరితిత్తుల్లో ఉండే ప్యారిన్ జైటీస్ దెబ్బ తింటుందన్నారు. ఫలితంగా ఊపిరితిత్తుల పనితీరు క్రమేణా తగ్గిపోయి సమస్యగా మారుతుందన్నారు. దీంతో నడిచేటప్పుడు ఆయాసం, కూర్చున్నప్పుడు పొడిదగ్గు, శ్వాస తీసుకోలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయని వివరించారు. పొగతాగడం, వాతావరణ కాలుష్యం, కీళ్ల వాతం, టీబీ కారణాల వల్ల ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. తమ ఆస్పత్రిలో శ్వాసకోశ వ్యాధులకు సంబంధించి లంగ్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఎక్మో, ఈసిఎంఓ ఎక్మో, బ్రాంకోస్కోపీ, తొరకోస్కోపీ, ఈబస్ వ్యాధులకు ఆధునిక చికిత్స ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పేషంట్ బాషా మాట్లాడుతూ ఊపిరితిత్తుల సమస్యలతో తాను తీవ్ర అనారోగ్యానికి గురి అయ్యానని పేర్కొన్నారు. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత అందరిలా సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి టీం లీడర్ శ్రీనివాసరెడ్డి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ పవన్ కుమార్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో సమయపాలన తప్పనిసరి



రేషన్ అందించే ఏర్పాటు చేస్తున్న ఆర్‌డిఒ, తహశీల్దార్

ప్రజాశక్తి - చాపాడు

సరుకుల పంపిణీలో డీలర్లు సమయపాలన తప్పక పాటించాలని జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ సూచించారు. మండల కేంద్రమైన చాపాడు రేషన్ షాపు పరిధిలోని ఎస్సీ కాలనీలో నడవలేని స్థితిలో ఉన్న సరోజనమ్మ, మహాలక్ష్మమ్మ అనే లబ్ధిదారులకు ఆమె బుధవారం రేషన్ బియ్యాన్ని ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రతినెల రేషన్ సరుకులు క్రమం తప్పకుండా వృద్ధులకు ఇంటి వద్దకు చేర్చాలన్నారు. రేషన్ సరుకులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఇవ్వాలన్నారు. రేషన్ సరుకుల నిల్వ వివరాలు, ధరల పట్టికను సూచిస్తూ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమాకుమారి, డీలర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని ఆయా గ్రామాల్లో ఉన్న డీలర్లు సక్రమంగా కార్డుదారులకు పంపిణీ చేయాలని తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు బుధవారం వేంపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లె రేషన్ షాపును తహశీల్దార్ సిబ్బందితో ఆకస్మికంగా తనిఖీ చేశారు. వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి డీలర్ పూర్తిగా రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేయాలన్నారు. బియ్యం కోసం రేషన్ షాపుల వద్ద కార్డుదారులు వేచి ఉండాల్సిన అవసరం కూడా లేదన్నారు. పంపిణీ చేస్తారని చెప్పారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా డీలర్లు షాపుల వద్ద బియ్యం కార్డుదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ లోకేష్, చింతలమడుగుపల్లె డీలర్ నాగిరెడ్డి, విఆర్ఒ బషీర్ బాబా పాల్గొన్నారు.

చక్రాయపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన రేషన్ సరుకులు పంపిణీని సక్రమంగా నిర్వహించాలని తహశీల్దార్ విజయకుమారి సూచించారు. చక్రాయపేటలో బుధవారం ఆమె వృద్ధులకు బియ్యం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 65 ఏళు పై బడిన వారికి, విభిన్నప్రతిభావంతులకు ఇంటి వద్దనే నాణ్యమైన బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు పంపినీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో చక్రాయిపేట డీలర్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాడుగలు చెల్లించకపోతే సీజ్ చేస్తాం

ప్రజాశక్తి - వేంపల్లె

జడ్‌పి వాణిజ్య గదులకు వ్యాపారులు బాడుగలు చెల్లించకపోతే వాటిని సీజ్ చేసి వేలం పాట నిర్వహిస్తామని డిప్యూటీ సిఇఒ మైథిలీ పేర్కొన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న జడ్‌పి వాణిజ్య గదులను బుధవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మైథిలీ మాట్లాడుతూ నాలుగు రోడ్ల కూడలిలో 40 జడ్‌పి గదులు ఉన్నట్లు చెప్పారు. ఇందులో 5 గదులు ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. రూం నెంబర్లు 7, 28 వాణిజ్య గదులకు చెందిన యాజమానుల నుండి రూ.5.16 లక్షలు రావాల్సి ఉందన్నారు. 35 గదుల నుండి రూ.20 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. బాడుగలు సరిగా చెల్లించకపోవడంతో నోటిసులు ఇచ్చామన్నారు. వాటికి స్పందన లేకపోవడంతో స్వయంగా వచ్చి బకాయిలు చెల్లించాలని కోరినట్లు చెప్పారు. బకాయిలను ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఆదేశించామన్నారు. సకాలంలో బాడుగలు చెల్లించని గదులకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. బకాయిలు చెల్లించేందుకు దుకాణాదారులు సమయం కోరారన్నారు. వాణిజ్య గదులు వర్షానికి ఉరుస్తున్నాయని, మరమ్మతులు చేయాలని వ్యాపారులు కోరారు. విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఒ గంగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రఘునాథ్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, జడ్‌పి అధికారులు పాల్గొన్నారు.



బకాయిలు చెల్లించాలని వ్యాపారులను కోరుతున్న మైథిలీ



ప్రజలతో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

'న్యాయం జరిగే వరకూ పోరాడుతూనే ఉంటాం'

ప్రజాశక్తి - వేముల

కేకే కొట్టాల గ్రామ సమీపంలోని యురేనియం కర్మగారం నుంచి రసాయనాలతో కూడుకున్న వ్యర్థాలను నిల్వచేసే టెయిలింగ్‌పాండ్‌ను బుధవారం ఎఇఆర్‌బి వారు సందర్శించారు. విషయం తెలుసుకున్న కేకే కొట్టాల గ్రామస్తులు పెద్ద ఎత్తున అందరూ అక్కడికి చేరుకున్నారు. రైతులు అధికారులతో తమ సమస్యలు వివరించారు. టెయిలింగ్ పాండ్ వల్ల చుట్టుపక్కల గ్రామస్తులు చాలా ఇబ్బందులకు గురువతున్నారని, అనారోగ్య సమస్యలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంట దిగుబడి రాక నష్టాలు చవిచూస్తూ అప్పులపాలవుతున్నామని వాపోయారు. యుసిఐఎల్ అధికారులకు పలుమార్లు చెప్పుకున్నా తమగోడు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎన్ని సమస్యలు చెప్పినా వారు కంపెనీవైపే సానుకూలంగా మాట్లాడుతున్నారని తెలిపారు. తమ గ్రామానికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటామని ప్రజలు అధికారులతో తేల్చి చెప్పారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు శాఖ గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. గ్రంథాలయ శాఖ అధికారి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏప్రిల్ 28 నుంచి విద్యార్థులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. చివరి రోజు బహుమతులు అందజేశారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రంగాల్లో అవగాహన కల్పించామన్నారు. ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ, ఉర్దూ హైస్కూల్ హెడ్‌మాస్టర్ కమలనాథ్ శర్మ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నక్కలదిన్నె బీడీసీ రవిశంకర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు అద్భుత విజయాలు సాధించారు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఏడాది పాలనలో సిఎం చంద్రబాబు అద్భుత విజయాలు సాధించారని, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖాజీపేటలో టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో చెప్పిన వాగ్దానాలు అమలుకు నోచుకుంటున్నాయని తెలిపారు. ప్రతిపక్ష పార్టీ వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రం ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగా లేకపోయినా ముందుచూపుతో వ్యవహరిస్తూ హామీల అమలుకు సీఎం ముందుకెళ్తున్నారన్నారు. మైదుకూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చెప్పిన మేరకు చెరువులు, శ్మశానాల అభివృద్ధి, రాజోలి జలాశయ నిర్మాణానికి కృతనిశ్చయంతో పోరాడుతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగపట్నం రామసుబ్బయ్య, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, లక్కు పుల్లారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని జమ్మలమడుగు జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా బుధవారం స్థానిక పలగాడి మోటు వద్ద జనసేన ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం పింఛన్ పెంచడం ప్రభుత్వం ఇచ్చిన హామీలో మొదటిదన్నారు. దీన్ని అమలు చేస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధి గత ప్రభుత్వంలో కుంటు పడటంతో దాన్ని గాడిలో పెట్టే పనిలో ఉన్నారన్నారు. జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేశారన్నారు. మోడీ సూచనలకు అనుగుంగా రాష్ట్రం మరింత అభివృద్ధి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పులివెందుల రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో జూన్ 4 చరిత్ర సృష్టించిన రోజని, ప్రజా విప్లవానికి నియంత పాలకులు కొట్టుకుపోయిన రోజని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి సతీమణి మారెడ్డి లతారెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం టిడిపి కార్యాలయంలో హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. చరిత్ర సష్టించిన రోజు సందర్భంగా టిడిపి నాయకులకు, కార్యకర్తలకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తూగుట్ల సిద్ధారెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, తుగూట్ల మధు, సిద్దయ్య, పెంచలయ్య, భాస్కర్ రెడ్డి, ఖాసీం వల్లి, తుగుట్ల రాజా, మేకల విజయ్ భాస్కర్, లింగాల విశ్వనాథరెడ్డి జెండమను బాబా ఫకృద్ధీన్, జనసేన పార్టీ నాయకులు సయ్యద్. ఉమర్, షరీఫ్, అబ్దుల్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : వైసిపి పాలన నుండి ప్రజలు విముక్తి పొందిన రోజు జూన్ 4 అని మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ వై.ఎస్.జబీవుల్లా పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకు ప్రభుత్వ వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. ప్రశ్నించే వ్యక్తులపై, ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై, ప్రతిపక్ష నాయకుల ఇళ్లపై దాడులు చేయడంతోపాటు వ్యవస్థలను వాలంటీర్ల చేతుల్లోకి తీసుకెళ్లారన్నారు. ప్రజలు ఆగ్రహించి 2024 జూన్ 4న రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు వైసిపి నుండి విముక్తిని కోరి టిడిపి, జనసేన, బిజెపి కూటమికి మద్దతిచ్చి అధికారాన్ని అందించారని వివరించారు. నాయకులు దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి, తలారి రమేష్, అజారుద్దీన్, నాగేంద్ర పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి పలు సమస్యలు

ప్రజాశక్తి - వేముల

పలు సమస్యలను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి బుధవారం విజయవాడలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లారు. పులివెందుల నియోజకవర్గంలోని పలు సమస్యలపై వివరిస్తూ వేముల మండలంలో ముస్లింలకు షాదీఖానా, చాలా పంచాయతీలలో కార్యదర్శులు చాలా తక్కువగా ఉన్నారని తెలిపారు. వెంటనే గ్రామ పంచాయతీలకు, సచివాలయాలలో తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. అందుకు మంత్రి సవిత స్పందిస్తూ తొందరలో సమస్యలను పరిష్కారం చూపుతానని మాట ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.